సాక్షి అనంతపురం

మంగళవారం । 2 । జనవరి । 2024



గుడ్డు.. వెరీ గుడ్డు

ఉమ్మడి జిల్లాలో కోడిగుడ్ల వినియోగం భారీగా పెరిగింది. మాంసాహారులతో పాటు శాకాహారులు ఇష్టంగా తింటున్నారు. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మార్కెట్‌లో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.6°/ 14.9°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

అందరికీ ఆరోగ్యం



- నేటి నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- అనంతపురం జిల్లాలో 465, 'శ్రీసత్యసాయి'లో 450 క్యాంపులు
- 500 మందికి పైగా పాల్గొననున్న స్పెషలిస్టు వైద్యులు
- చరిత్రలో తొలిసారి పల్లె ముంగిటకు చేరిన వైద్యసేవలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : అందరికీ ఆరోగ్యం.. ఇదే ప్రభుత్వ ధ్యేయం. పల్లె ముంగిటకే ఆరోగ్య సేవలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ప్రవేశపెట్టారు. తొలి విడత కార్యక్రమం ఉమ్మడి అనంతపురం జిల్లాలో విజయవంతమైంది. మంగళవారం నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతపురం 465, శ్రీసత్యసాయి జిల్లాలో 450 చొప్పున సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో క్యాంపులు నిర్వహించనున్నారు.

దీర్ఘకాలిక జబ్బులపై జల్లెడ

సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక జబ్బులను వైద్యులు జల్లెడ పడుతున్నారు. వారంలో మంగళవారం, శుక్రవారం గ్రామీణ ప్రాంతాల్లోనూ, ప్రతి బుధవారం అర్బన్ ప్రాంతంలోనూ సురక్ష క్యాంపులు నిర్వహిస్తారు. సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక జబ్బులతో అంటే మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛ వ్యాధులు, గుండె జబ్బులు ఇలా ఏవైనా ఉంటే గుర్తించి మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు రెఫర్ చేస్తారు. అంతేకాదు అక్కడ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఎంత ఖర్చయినా ఉచితంగా వైద్యం చేస్తారు.



అనంతపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న జనం (ఫైల్)

ప్రతి క్యాంపులోనూ స్పెషలిస్టులు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులుండేలా చర్యలు తీసుకున్నారు. గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ ప్రధానంగా ఉంటారు. ఈ ముగ్గురితో పాటు కంటికి సంబంధించిన డాక్టర్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కంటివైద్య నిపుణులు తక్కువగా ఉండటంతో ఇతర నగరాలు లేదా ప్రాంతాల్లో ఉన్న వైద్యులను క్యాంపులకు రప్పిస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. అనంతపురం జిల్లాలో 465 సురక్ష క్యాంపులు జరగనున్నాయి. వీటిలో 500 మందికి పైనే వైద్యులు, 2 వేల మందికి పైగా పారామెడికల్ సిబ్బంది పాల్గొననున్నారు. ప్రతి ఆరు మండలాలకు ఒక నోడల్ అధికారిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులను ఇందులో భాగస్వాములను చేసినట్టు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందిస్తాం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాం. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఇందులో భాగస్వాములయ్యారు. పేదలకు అందుబాటులోకి వైద్యసేవల్లో భాగంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే చేపట్టాం. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే కార్యక్రమం ఉద్దేశం. నేటినుంచి నిర్ణయించిన క్యాంపుల్లో అధికారులు అందరూ పాల్గొని వైద్యసేవలందిస్తారు.

–గౌతమి, కలెక్టర్, అనంతపురం

అనంతపురం జిల్లాలో మొదటి దశ 'ఆరోగ్య సురక్ష' ఇలా..	
ఔట్‌పేషెంట్ సేవలు పొందిన వారు	2,23,474
రెఫరల్స్‌కు వెళ్లిన వారు	3,562
క్యాటరాక్ట్ రెఫరల్స్	3,695
ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు	678
హైపర్ టెన్షన్ చెకప్‌లు	2,23,474
మధుమేహం చెకప్‌లు	2,23,474
హిమోగ్లోబిన్ టెస్ట్	91,418
టీబీ టెస్ట్‌లు	6647

శ్రీసత్యసాయి జిల్లాలో మొదటి దశ 'ఆరోగ్య సురక్ష' ఇలా..	
ఔట్‌పేషెంట్ సేవలు పొందినవారు	1,70,554
రెఫరల్స్‌కు వెళ్లిన వారు	3,750
క్యాటరాక్ట్ రెఫరల్స్	3,026
ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు	873
హైపర్ టెన్షన్ చెకప్‌లు	1,70,554
మధుమేహం చెకప్‌లు	1,70,554
హిమోగ్లోబిన్ టెస్ట్‌లు	73,398
టీబీ టెస్ట్‌లు	3,677


న్యూస్‌రీల్

'వందేభారత్'కు ప్రజాదరణ



గుంతకల్లు: జిల్లా మీదుగా పరుగులు పెడుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వంద శాతానికి పైగా ప్రయాణికులతో వెళ్తున్నాయి. ఈ మేరకు డీఆర్ఎం మనీష్ అగర్వాల్, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023లో దక్షిణ మధ్య రైల్వేలో వివిధ స్టేషన్ల నుంచి నాలుగు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. వీటికి క్రమంగా ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ఇందులో గుంతకల్లు డివిజన్ మీదుగా రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా.. గత ఏడాది ఏప్రిల్‌లో సికింద్రాబాద్–తిరుపతి, సెప్టెంబర్‌లో కాచిగూడ – యశ్వంత్‌పూర్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. రైలు ఆక్యుపెన్సీ 107 శాతం ఉండగా ఇది తిరుగు ప్రయాణంలో 110 శాతానికి పైగా ఉంటోందన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రాకపోకలు సాగించేందుకు యువత ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోందన్నారు. పూర్తి ఆక్యుపెన్సీతో వందేభారత్ రైళ్లను నడుపుతుండడంపై రైల్వే జీఎం అరుణ్ కుమార్‌జైన్ సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించినట్లు తెలిపారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి



ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద పర్యాటకులు

లేపాక్షి: నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. నంది విగ్రహం, థీమ్ పార్క్, జటాయువు పక్షి తదితర ప్రాంతాలను సందర్శించారు. ఆలయంలో దుర్గాదేవి, వీరభద్రస్వామి మూలవిరాట్‌లను అర్చకులు అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవదాయ శాఖ ఈఓ మృతి



నాగేంద్ర ప్రసాదరావు (ఫైల్)

మడకశిర రూరల్: మడకశిర నియోజకవర్గంలోని సమూహ దేవాలయాలకు గ్రేడ్ వన్ కార్య నిర్వహణాధికారి(ఈఓ)గా పనిచేస్తున్న కె.నాగేంద్రప్రసాదరావు (55) సోమవారం కన్నుమూశారు. లేపాక్షి గ్రామానికి చెందిన ఈయన ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలు చోట్ల విధులు నిర్వర్తించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈయన్ని రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించి సోమవారం ఆయన చనిపోయారు. నాగేంద్ర ప్రసాదరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. ఈఓ మరణ వార్త తెలియగానే మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, ఎంపీపీ కవిత, కో–ఆప్షన్ సభ్యుడు ప్రకాష్, సర్పంచ్ కరియన్న దేవదాయశాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రగతి పథంలో 'ఏపీజీబీ'



విలేకరులతో మాట్లాడుతున్న రాకేష్‌కశ్యప్

కడపకోటిరెడ్డి సర్కిల్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 2023లో ప్రగతి పథకంలో పయనించిందని ఆ బ్యాంకు ఛైర్మన్ రాకేష్‌కశ్యప్ తెలిపారు. కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, పొట్టిశ్రీరాములు, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 551 శాఖలు, 1182 బిజినెస్ కరస్పాండెంట్లు, 9 ప్రాంతీయ కార్యాలయాలను కలిగి ఉన్నట్లు గుర్తు చేశారు. 2023, డిసెంబరు నాటికి రూ. 20,648 కోట్ల డిపాజిట్లు, పోర్టుపోలియో, మరో రూ. 24159 కోట్ల అడ్వాన్సు పోర్టుపోలియోతో కలిపి రూ. 44,808 కోట్ల వ్యాపారం సాగినట్లు వివరించారు. వ్యవసాయం, అనుబంధిత, ఎంఎస్ఎంఈ, విద్య, గృహ నిర్మాణం, వాహనం, బంగారు ఆభరణాలు మొదలైన ఉత్పత్తులకు అవసరమైన డబ్బును బ్యాంకు ద్వారా ఫైనాన్స్ చేస్తున్నట్లు తెలిపారు. డీజీ ఖాతా, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, ఏటీఎం వంటి డిజిటల్ సేవలనూ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. డెబిట్ కార్డులు, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏఈపీఎస్, ఎన్ఏసీహెచ్, ఈసీఎస్ ఆదేశాలు, మైక్రో ఏటీఎంలు, ఏటీఎం తదితర వాటి ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లపై అన్ని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేటును ఇస్తున్నామన్నారు. నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా 'ప్రగతి కుబేర్–444' పేరుతో ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జీఎంలు జగదీశ్వర్‌రావు, పీఆర్ పద్దేట్వార్, సంజీవప్ప, రంగప్ప బేగర్, పి.రాజేంద్రన్, ఆర్.గిరితోపాటు చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

8 వరకు పింఛన్ పెంపు మహోత్సవాలు

- కొత్తగా 5,234 మందికి పింఛన్లు
- మొత్తం 2,93,493 లబ్ధిదారులకు రూ.87.92 కోట్లు విడుదల
- రూ.3 వే పింఛన్ పొందనున్న 2,31,513 మంది



అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, చేతి వృత్తిదారులకు ఇస్తున్న రూ.2,750 పింఛన్‌ను ఈ నెల నుంచి రూ.3వేలకు పెంచింది. ఈ నెల ఎనిమిదో తేదీ వరకు అన్ని మండల, మున్సిపాలిటీ కేంద్రాల్లో పింఛన్ పెంపు మహోత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులందరూ పాల్గొనాలన్నారు. జనవరి నెలకు సంబంధించి 2,93,493 మంది పింఛన్‌దారులకు రూ.87.92 కోట్లు విడుదలైందన్నారు. ఇందులో కొత్తగా మంజూరైన పింఛన్లు 5,234 ఉన్నాయన్నారు. మొత్తం లబ్ధిదారుల్లో 2,31,513 మంది రూ.3వేల పింఛన్లు అందుకోనున్నారన్నారు. మండల, మున్సిపల్ కేంద్రాల్లో పింఛన్ పెంపు మహోత్సవాలు జరిగినప్పటి నుంచి పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు. ఈ మార్పును పింఛన్‌దారులు గమనించాలని కోరారు. ఈ నెల మూడో తేదీ అనంతపురం అర్బన్, గార్లదిన్నె, గుమ్మఘట్ట, గుంతకల్లు రూరల్, గుంతకల్లు అర్బన్, కళ్యాణదుర్గం రూరల్, కూడేరు, నార్పల, రాప్తాడు, రాయదుర్గం రూరల్, శింగన మల, తాడిపత్రి అర్బన్, తాడిపత్రి రూరల్‌లో పింఛన్ పెంపు మహోత్సవాలు జరుగుతాయన్నారు. 4న బెళుగుప్ప, అనంతపురం రూరల్, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, డి.హీరేహాళ్, గుత్తి రూరల్, గుత్తి అర్బన్, కళ్యాణదుర్గం అర్బన్, పెద్దపప్పూరు, 5న ఆత్మకూరు, కణేకల్లు, పామిడి రూరల్, పామిడి అర్బన్, పుట్లూరు, రాయదుర్గం అర్బన్, శెట్టూరు, ఉరవకొండ, యాడికి, యల్లనూరు, విడపనకల్లు, 6న వజ్రకరూరు, బ్రహ్మసముద్రం, పెద్దవడుగూరు, కుందుర్పి, కంబదూరులో పింఛన్ పెంపు మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. వలంటీర్లందరూ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేస్తారన్నారు. పంపిణీ సమయంలో ముఖ్యమంత్రి లేఖను పింఛన్‌దారులకు అందజేస్తారన్నారు.

నూతన సంవత్సరంలో 'సంక్షేమ' జాతర

నూతన సంవత్సరంలో 'సంక్షేమ' జాతర జరగనుంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14 వరకు పింఛన్ల పెంపు సహా మూడు ప్రధాన పథకాల ద్వారా అర్హులకు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం 'ఆసరా'. ఈ నెల 23 నుంచి 31 వరకు 'ఆసరా' వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ పథకం కింద నాలుగో విడత ద్వారా జిల్లాలో 24,100 డ్వాక్రా సంఘాలకు రూ.183.59 కోట్ల లబ్ధి చేకూరనుంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలుగో విడతలోనూ ఆర్థిక సాయం అందించేందుకు ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1,18,881 మంది మహిళలకు రూ.35.96 కోట్లు అందజేయనున్నారు.

అర్హులకు 'పట్టా'భిషేకం

- పేదరికం ప్రామాణికంగా నివాస స్థలం
- ఇళ్ల స్థలాల మంజూరు యజ్ఞంలా కొనసాగింపు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు ఎవరి సిఫార్సులూ అవసరం లేదు. పేదరికం ప్రామాణికంగా అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుతోంది. ప్రధానంగా పేదల సొంతింటి కలను జగన్ సర్కార్ సాకారం చేస్తోంది. అర్హత ఉంటే చాలు ఇంటి స్థలం కేటాయించి.. పట్టా ఇవ్వడంతో పాటు పక్కా గృహం మంజూరు చేస్తోంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 655 జగనన్న లే– అవుట్లను ఏర్పాటు చేసి, అందులో అర్హులైన 99,920 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు పక్కా ఇళ్లను మంజూరు చేసింది. అంతటితో సరిపెట్టలేదు. పేదలకు ఇళ్ల స్థలం మంజూరు ప్రక్రియను యజ్ఞంలా కొనసాగిస్తోంది. కొత్తగా 25,943 మందిని ఇళ్ల పట్టాల కోసం అర్హులుగా గుర్తించారు. ఇందులోనూ 6,482 మందికి నివాస స్థలాన్ని మంజూరు చేశారు. మిగిలిన 19,461 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలం ఇచ్చేందుకు స్థల సేకరణ ప్రక్రియను జిల్లా రెవెన్యూ యంత్రాంగం వేగవంతం చేసింది.



అనంతపురం నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం గుర్తించిన స్థలం

అర్హులందరికీ ఇంటి స్థలం



అర్హులైన వారందరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తాం. కొత్తగా గుర్తించిన అర్హులకు సంబంధించి అనంతపురం నియోజకవర్గం పరిధిలో రెండు వేల మందికి ఇంటి స్థలం ఇచ్చేందుకు స్థల సేకరణ పూర్తయ్యింది. వీటిలో రెండు మూడు లే అవుట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ఇదే విధంగా ఇతర నియోజకవర్గాల్లోనూ స్థల సేకరణ ప్రక్రియ సాగుతోంది.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

అలరించిన 'నూతన' వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సినీనటి సాయిపల్లవి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో నూతన సంవత్సర వేడుకలు కనుల పండువగా జరిగాయి. వేదపఠనంతో వేడుకలు ప్రారంభం కాగా, సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్ నిర్వహించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి 99వ జయంత్యుత్సవాల లోగోను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సత్యసాయి మీడియా సెంటర్ డైరెక్టర్ సుందర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. సాయంత్రం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ పూర్వ విద్యార్థులు 'నిధి టూ సన్నిధి' పేరుతో నాటిక ప్రదర్శించారు.

వేడుకల్లో పాల్గొన్న సినీనటి సాయిపల్లవి

ప్రముఖ తెలుగు సినీనటి సాయి పల్లవి ప్రశాంతి నిలయంలో సోమవారం జరిగిన నూతన సంవత్సర వేడుకలు, సత్యసాయి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు

అనంతపురం కల్చరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పాత పాటల ప్రేమికుల సంఘం, పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్‌డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రాజీవ్ చిల్డ్రన్ పార్కులో 'గంధర్వ గానామృతం' నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన గాయకులు ఆలపించిన మధురమైన పాత పాటలు ఆకట్టుకున్నాయి. పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఈఈ మల్లికార్జున మూర్తి, నిర్వాహకులు ఘంటసాల రామయ్య, ఏఈఈ ఓబుళదాసు తదితరులు మాట్లాడారు.

అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

- అధికారులు, సిబ్బందికి కలెక్టర్ పిలుపు
- రెవెన్యూ భవన్‌లో న్యూ ఇయర్ సందడి

అనంతపురం అర్బన్: నూతన సంవత్సరంలో కొత్త ఆలోచనలతో... కొత్త లక్ష్యాలను సమష్టిగా పూర్తి చేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలుపుదామని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ గౌతమి, రోహిత్ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు పలువురు అధికారులు, సిబ్బంది పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, రాణీ సుస్మిత, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్, విభాగాల అధిపతులు, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీఎస్ఓ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరెడ్డి, సమాచార శాఖ డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, దివాకర్‌రావు, పలువురు అధికారులు, అనధికారులు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ గౌతమి, రోహిత్ దంపతులు

ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు

అనంతపురం క్రైం: జిల్లాలో ఆదివారం రాత్రి నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై 84, లైసెన్స్ లేకుండా వాహనాలపై వెళ్తున్న వాహనదారులపై 5, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారిపై 33, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిపై 43 కేసులతో కలిపి మొత్తం 165 కేసులు నమోదు చేశామన్నారు. వివిధ రకాల 65 వాహనాలు సీజ్ చేశామని పేర్కొన్నారు. న్యూసెన్స్ కేసులు, బహిరంగ మద్యపానం కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. అనంతపురం సహా తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, పామిడి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం పట్టణాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారన్నారు. పోలీసులకు సహకరించిన జిల్లా ప్రజలకు, యువతకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

మరింత సమర్థవంతంగా పనిచేద్దాం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) ఆవరణలో సోమవారం న్యూ ఇయర్ సందడి నెలకొంది. డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డిని కలిసేందుకు అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లా అధికారులు వచ్చారు. అనంతపురం ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, డీఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందించి డీఐజీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డీఐజీ మాట్లాడుతూ 2024 సంవత్సరంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమిద్దామని పోలీసు అధికారులకు సూచించారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ : జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఎస్పీ అన్బురాజన్ కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది ఎస్పీని కలసి బొకేలు అందించి విషెస్ చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ కొత్త ఏడాదిలో రెట్టింపు ఉత్సాహంతో పని చేద్దామన్నారు. అదనపు ఎస్పీలు, ఏఆర్ విభాగం, డిపీఓ సిబ్బంది, ఎస్బీ అధికారులు, డీసీఆర్బీ స్టాఫ్, పోలీసు అధికారుల సంఘం నేతలు, జిల్లా వ్యాప్తంగా పలువురు డిఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిశారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 14 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 14 వినతులు అందాయి. ఎస్పీ అన్బురాజన్ స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు.

విష ప్రభావంతో గేదెలు మృతి



మృతిచెందిన ఎనుములు

గుంతకల్లు రూరల్: విషపూరితమైన నీళ్లు తాగడంతో నాలుగు గేదెలు, ఓ దూడ మృత్యువాత పడ్డాయి. వివరాలు.... గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన నరసింహులు తనకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయ పనులతో పాటు పాడి పోషణ చేపట్టాడు. ఈ క్రమంలో ఒక్కొక్కటి రూ.60 వేలు చొప్పున వెచ్చించి ఐదు గేదెలు కొనుగోలు చేసి, తన భార్య శివమ్మతోకలసి పాల వ్యాపారం మొదలు పెట్టాడు. ఆదివారం ఉదయం మేపునకు అరు బయలు ప్రాంతానికి తోలుకెళ్లిన గేదెలను రాత్రికి ఇంటికి చేర్చారు. కాసేపటికి తొట్టిలో ఉన్న నీళ్లు తాగిన నాలుగు గేదెలు, ఓ దూడ ఒక్కసారిగా గిలగిలకొట్టుకుంటూ మృతి చెందాయి. తమకు గిట్టని వ్యక్తులు నీటి తొట్టిలో విషం కలిపారని, ఆ నీటిని తాగడం వల్లనే తమ ఎనుములు మృతి చెందాయని బాధితులు వాపోయారు. ఘటనతో దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా గేదెల మృతికి కారణాలు వెల్లడిస్తామని పశువైద్యులు అన్నారు.

కారు బోల్తా

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం కారు బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బెంగళూరుకు చెందిన దంపతులు మంజునాథ, లత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా స్థిరపడ్డారు. బెంగళూరు నుంచి మంత్రాలయం వెళుతుండగా ఎగువపల్లి వద్దకు చేరుకోగానే కారు ముందు చక్రం పంచర్ కావడంతో అదుపు తప్పి పల్లంలోకి బోల్తాపడింది. ఘటనలో ఎవరూ గాయపడలేదు.

గుడ్డు.. వెరీ గుడ్డు



- ఉమ్మడి జిల్లాలో పెరిగిన కోడిగుడ్ల వినియోగం
- నిత్యం 3.80 లక్షల గుడ్ల ఉత్పత్తి
- కర్ణాటక నుంచి 6.30 లక్షల దిగుమతి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ...	
పెంచుతున్న కోళ్ల సంఖ్య	4.20 లక్షలు
రోజుకు కోడి గుడ్ల ఉత్పత్తి	3.80 లక్షలు
కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్న గుడ్లు	6.30 లక్షలు
పౌల్ట్రీ రైతులకు గుడ్డుపై దక్కుతున్న ధర	రూ.5.15
ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర	రూ.6.25

హిందూపురం అర్బన్: జిల్లాలో కోడి గుడ్ల వినియోగం భారీగా పెరిగింది. కల్తీ లేని పదార్థం కావడంతో వైద్యులు సైతం మంచి పౌష్టికాహారంగా చెబుతున్నారు. దీంతో గుడ్డు వినియోగం నానాటికీ పెరుగుతోంది. మాంసాహారులతో పాటు శాఖాహారులు సైతం గుడ్డును ఇష్టంగా తింటున్నారు. 10 ఏళ్ల క్రితం ఉమ్మడి అనంతపురముజిల్లాలో కోడి గుడ్ల వినియోగం 3.50 లక్షలు ఉండగా.. ఇప్పుడు 10.10 లక్షలకు చేరింది.

రోజుకో గుడ్డు ఆరోగ్యకరం..

చికెన్ ధరతో పోల్చుకుంటే గుడ్డు ధర తక్కువగా ఉండడం, పోషకాలు ఎక్కువగా ఉండడంతో వీటిని వినియోగించేవారి సంఖ్య పెరుగుతోంది. వైద్యులు సైతం రోజుకు ఓ గుడ్డు ఆహారంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆరు నెలల వయసున్న శిశువుల నుంచి వృద్ధుల వరకూ ప్రతీ ఒక్కరూ గుడ్డు తినొచ్చు అంటున్నారు. గుడ్డు జీర్ణం కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారు వైద్యుల సలహాను అనుసరించి తీసుకోవాలంటున్నారు. మధుమేహం, బీపీ, కిడ్నీ, కాలేయం ఎలాంటి సమస్యతో ఉన్న వారికైనా గుడ్డు తినడం వల్ల హాని కలగదని నిపుణులు అంటున్నారు.

గుడ్డులో ఏముంటాయి?

కోడిగుడ్డు సాధారణంగా 65 గ్రాముల బరువు ఉంటుంది. ఉడికించిన గుడ్డులో పొటాషియం, ఐరన్, కాల్షియం, జింక్, విటమిన్–ఇ, విటమిన్–ఎ, జింక్, సెలీనియం, విటమిన్–డీ పుష్కలంగా ఉంటాయి. ఒక గుడ్డు నుంచి 6.29 గ్రాముల ప్రొటీన్‌తో పాటు 78 క్యాలరీల శక్తి అందుతుందని పరిశోధనల్లో తేలింది. గుడ్డులో మాంసకృత్తులు సమృద్ధిగా ఉండడం వల్ల మనిషి ఆరోగ్యవంతంగా ఎదిగేందుకు దోహదపడుతుంది. ముఖ్యంగా కండర నిర్మాణానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఒక ఉడికించిన గుడ్డును తీసుకోవడం వల్ల శరీరానికి ప్రొటీన్ శక్తిని అందించడమే కాకుండా కంటి చూపు మెరుగ్గా పడేందుకు దోహదపడుతుంది. గుడ్డులో ఉన్న సల్ఫర్, పలురకాల విటమిన్లు, లవణాల వల్ల జుట్టుకి మంచి పోషణ అందుతుంది. అధికంగా శారీరక శ్రమ చేసేవారు తిరిగి శక్తిని పుంజుకునేందుకు కోడిగుడ్డు చాలా దోహదపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

రోజుకు 3.80 లక్షల గుడ్ల ఉత్పత్తి..

ఉమ్మడి జిల్లాలో రోజుకు 3.5 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి జరుగుతుండగా కర్ణాటక, తెలంగాణ నుంచి మరో 6.30 లక్షల గుడ్లు సగటున దిగుమతి అవుతున్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ రైతులకు ప్రతి గుడ్డుపై రూ.5 నుంచి రూ.5.15 చొప్పున గిట్టుబాటు ధర లభ్యమవుతోంది. రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డును రూ.6.25తో విక్రయాలు సాగిస్తున్నారు.

రోజూ ఓ గుడ్డు తప్పనిసరి



కోడి గుడ్డులో అనేక పోషకాలు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఎవరైనా రోజూ ఒకటి చొప్పున గుడ్డు తినవచ్చు. శరీరం దృఢంగా మారాలంటే క్రమం తప్పకుండా రోజూ ఆహారంలో కోడి గుడ్డు తీసుకోవడం మేలు. రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది.

– డాక్టర్ ప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, హిందూపురం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

- ఫిబ్రవరిలో పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్ విద్యార్థులు నేషనల్ లెవెల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. గత ఆదివారం అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహించారు. ఇందులో జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ గురుకుల ప్రతిభావంతుల ఆశ్రమ పాఠశాల తరఫున లాంగ్ జంప్‌లో భూపతిరెడ్డి, నందిత్‌రెడ్డి, రోహిత్, నరసింహారెడ్డి విద్యార్థులు రాణించారు. వీరంతా బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఫిబ్రవరిలో జరిగే నేషనల్ మీట్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక పాఠశాలలో నేషనల్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు నేతృత్వంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ప్రమీలమ్మ, సీనియర్ ఉపాధ్యాయుడు కృష్ణ, పీఈటీ షభానా పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, ఉపాధ్యాయులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన తలారి రమేష్ (43) సోమవారం ఉదయం స్నానం చేసి తన ఇంటి ఎదుట దుస్తులు ఆరవేస్తుండగా పక్కనే తెగిపడిన విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడి భార్య రామాంజినమ్మ మేడాపురం–2 ఎంపీటీసీ (వైఎస్సార్‌సీపీ)గా కొనసాగుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి ఆ గ్రామానికి చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పుట్టపర్తి రూరల్: స్థానిక శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, కామెడీషోలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

తిమ్మమ్మమర్రిమాను వద్ద పర్యాటకుల సందడి

ఎన్పీకుంట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. తిమ్మమాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసర ప్రాంతంలో ప్యూరిఫైడ్ వాటర్ సదుపాయం కల్పించినట్లు సర్పంచ్ విష్ణుమూర్తి తెలిపారు.

'సమగ్ర'లో అక్రమాలు

- కలెక్టర్ అనుమతుల్లేకుండానే పనులు
- నేరుగా వ్యక్తుల ఖాతాల్లోకి బిల్లులు
- సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగం తీరుపై విమర్శలు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగంలో పాలన గాడి తప్పింది. అనాథ, నిరుపేద ఆడ పిల్లలు చదువుకుంటున్న కేజీబీవీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంటే.. సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు మాత్రం కొత్త పోకడలకు తెరతీశారు. అవసరం లేకపోయినా మరమ్మతుల పేరుతో రూ.లక్షల బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా...

కేజీబీవీల్లో ఎలాంటి మరమ్మతులు చేపట్టాలన్నా.. ఒక్క రూపాయి ఖర్చు చేయాలన్నా పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) ఆమోదం తప్పనిసరి. చేపట్టే పనులకు సంబంధించిన నిధులు కచ్చితంగా ఎస్ఎంసీ ఖాతాలోనే జమ చేయాలి. పనులు పూర్తి కాగానే సదరు సంస్థలు/ కాంట్రాక్టర్లకు ఎస్ఎంసీ ద్వారానే బిల్లులు చెల్లించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగం అధికారులు నడుచుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల కేజీబీవీలో చేపట్టిన మరమ్మతు పనులకు రూ.లక్షలోపు బిల్లులు రెండు పర్యాయాలు చేశారు. ఈ నిధులు ఎస్ఎంసీ ఖాతాకు కాకుండా ఓ వ్యక్తి ఖాతాలోకి మళ్లించడం గమనార్హం. ఈ ఏడాది ఆగస్టులో ఒకే వ్యక్తి పేరు మీద రూ.96,453, రూ.96,294 బిల్లులు జమ చేశారు. పైగా ఈ పనులకు ఎలాంటి అనుమతులూ లేవు. ఎంబుక్ రికార్డ్, చెక్ మెజర్ కూడా చేయలేదు. ఇదే కేజీబీవీలో మొత్తం రూ.4.50 లక్షల వ్యయంతో గ్రావెల్ ఫిల్లింగ్ పనులను కలెక్టర్ లేదా ఎస్పీడీ అనుమతులు లేకుండానే చేపట్టారు. మొత్తం మూడు పనులుగా విభజించి పూర్తి చేసినట్లు రికార్డుల్లో చూపారు.

బీకేఎస్ కేజీబీవీలోనూ ...

బుక్కరాయసముద్రం కేజీబీవీలో మరమ్మతుల పేరుతో రూ.66,037 ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా 2022 నవంబరు 14న ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ పనికీ కలెక్టర్ అనుమతుల్లేవు. ఎస్టిమేషన్, టెక్నికల్ శాంక్షన్‌పై సంబంధిత శాఖ ఈఈ సంతకమూ లేదు. నిబంధనల మేరకు సమగ్ర శిక్షలో ఎలాంటి పనులు చేపట్టినా ముందుగా ఎస్ఎంసీ తీర్మానం పొందాలి. దీని ఆధారంగా కలెక్టర్ నుంచి పరిపాలన అనుమతులు తీసుకున్న తర్వాత ఏఈ ద్వారా వ్యయ అంచనాలు సిద్ధం చేయించాలి. ఈ అంచనా వ్యయానికి సంబంధిత డీఈ ఆమోదం తెలుపుతూ టెక్నికల్ శాంక్షన్ కోసం ఈఈకు పంపాలి. ఆయన కలెక్టర్ ద్వారా నోట్ అప్రూవల్ చేయించుకుని, టెక్నికల్ శాంక్షన్ చేస్తూ వర్క్ ఆర్డర్ ఇస్తారు. పని పూర్తి కాగానే సంబంధిత ఏఈ పర్యవేక్షణలో ఎంబుక్ రికార్డు చేసి, డీఈ ఆమోదంతో ఈఈకు పంపాలి. ఆయన పరిశీలించిన అనంతరం పేమెంట్ కోసం కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఈ నిబంధనలను సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ విభాగం అధికారులు తుంగలో తొక్కి రూ.లక్షల బిల్లులు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కలెక్టర్ అనుమతి తప్పనిసరి

కలెక్టర్ అనుమతి లేకుండా కేజీబీవీల్లో ఏ చిన్న పనీ చేసేందుకు వీల్లేదు. ఎస్ఎంసీల ఆమోదం మేరకే బిల్లులు చెల్లించాలి తప్ప నేరుగా వ్యక్తుల ఖాతాకు బదలాయించకూడదు. గోరంట్ల కేజీబీవీలో ఒకే పనిని మూడు భాగాలుగా విడగొట్టి బిల్లులు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేయిస్తాం.

– వరప్రసాదరావు, ఏపీసీ, సమగ్రశిక్ష

జనవాక్కు

జగన్‌కే మా మద్దతు



గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు పొద్దున పోతే సాయంత్రం వరకూ వేడి ఉండాల్సి వచ్చేది. 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ ఇదే తంతు. ఇప్పుడా పరిస్థితి లేదు. 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. మా బాగోగులు అడిగి తెలుసుకుంటున్నాడు. వైఎస్సార్ ఆసరాతో పాటు రైతు భరోసా అందుకున్నా. మాకు ఇంత మంచి చేసిన సీఎం వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– లక్ష్మక్క, గోళ్ల, కళ్యాణదుర్గం మండలం

రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మా బిడ్డల ఆరోగ్యానికి ఢోకా లేకుండా పోయింది. ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్న నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఇద్దరు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. నెలలో కనీసం రెండు సార్లు ఆస్పత్రికి పిలుచుకెళ్లాలి. ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా రూ.20 వేల వరకూ ఖర్చు వస్తుండేది. దీంతో కుటుంబం నడవడమే కష్టంగా మారింది. తలసేమియా బాధిత చిన్నారులకు జగన్ ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ అందజేస్తుండడం మాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ డబ్బుతో ఇద్దరి పిల్లలకూ క్రమం తప్పకుండా చికిత్స చేయిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది.

– వీరాంజనేయులు, పెద్దవడుగూరు

జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి



గత ప్రభుత్వంలో కరువు కాటకాలు తప్ప మరేమీ తెలియదు. బతుకు తెరువు కోసం వలస పోయేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత వర్షాలు బాగా పడ్డాయి. భూగర్భ జలాలు పెరిగియి. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో మాకూ చేతినిండా పనులు దొరుకుతున్నాయి. మాకు ఇంటి స్థలంతో పాటు పక్కా గృహ నిర్మాణమూ మంజూరైంది. త్వరలో సొంతింట్లోకి పోబోతున్నాం. మా అమ్మ గౌస్‌బీకి ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నాడు. అమ్మ ఒడి పథకం వర్తించడంతో మా కుమారుడి చదువుకు ఢోకా లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగింది. అందరి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

– బాగ్‌వాన్ శర్మస్‌వలి, వజ్రకరూరు

ఇంత గొప్ప పాలన చూడలేదు



ఇంత గొప్ప పాలన గతంలో ఎన్నడూ చూడలేదు. అడగకనే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోంది. సీఎం వైఎస్ జగన్‌తో ప్రతి కుటుంబానికీ మేలు జరిగింది. నాకూ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందించారు. ఈ డబ్బును పెట్టుబడిగా పెట్టి పంటల సాగు చేస్తున్నా. మా నాన్న చెన్నన్న గౌడ్‌కు పింఛన్ ప్రతి నెలా 1వ తేదీనే అందజేస్తున్నారు. గతంలో పింఛన్ కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయం వద్ద పడిగాపులు కాచారు. సచివాలయ వ్యవస్థతో పాలనను ఇంటి ముంగిటకే తీసుకువచ్చారు. మరో 30 ఏళ్లు వైఎస్ జగనే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా.

– నరేంద్రగౌడ్, గూళ్యపాళ్యం, వజ్రకరూరు మండలం

'తెలుగు తమ్ముళ్ల' వేరు కుంపట్లు!

- ప్రతి నియోజకవర్గంలోనూ బాహాబాహీ
- గ్రూపులుగా ఏర్పడి కొట్టుకుంటున్న వైనం
- కదిరి, పెనుకొండ, ధర్మవరంలో తారస్థాయికి విభేదాలు
- పుట్టపర్తిలో 'పల్లె'కు వ్యతిరేకంగా కార్యక్రమాలు
- మడకశిరలో దళితులను పక్కన బెట్టారని అధిష్టానంపై గుర్రు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో పోటీకి ముందుకు రాని నేతలు
- ఎవరిని బరిలో దింపాలనే దానిపై తలలు బాదుకుంటున్న పెద్దలు



సాక్షి, పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష టీడీపీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రూపు విభేదాలతో తమ్ముళ్లు బాహాబాహీకి దిగుతున్నారు. ఎవరికి వారు గ్రూపులుగా ఏర్పడి వేరు కుంపట్లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్న వారిని బరిలో దింపితే సహకరించే ప్రసక్తే లేదని ప్రతి నియోజకవర్గంలోనూ వ్యతిరేక వర్గం తేల్చి చెబుతోంది. దీంతో ఎవరిని పోటీలో నిలపాలో తెలియక టీడీపీ పెద్దలు నానా తంటాలు పడుతున్నారు.

దిగజారుతున్న టీడీపీ గ్రాఫ్..

టీడీపీ పెద్దలు జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థిపై ఇప్పటికే పలు కోణాల్లో రహస్యంగా సర్వేలు చేసినట్లు సమాచారం. అయినా ఎక్కడా అనుకున్న ఫలితం రానట్లు తెలుస్తోంది. మరోవైపు ఫ్లెక్సీల ఏర్పాటు నుంచి ప్రతి విషయంలో పబ్లిసిటీ పిచ్చితో 'తమ్ముళ్ల' మధ్య వివాదం రాజుకుంటుండగా టీడీపీ గ్రాఫ్ రోజురోజుకూ తగ్గుతోంది. కదిరి, పెనుకొండ, ధర్మవరం, మడకశిర, పుట్టపర్తిలో ఇదే తంతు కొనసాగుతోంది. వర్గ విభేదాలతో పాటు కుల ప్రస్తావన, పెత్తందారీ వ్యవస్థ కారణంగా టీడీపీ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. ఉన్న ఒక్క సీటు (హిందూపురం) కూడా ఈసారి గెలుస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. రెండు (అనంతపురం, శ్రీసత్యసాయి) జిల్లాల్లో భాగంగా ఉన్న రాప్తాడులో అధికంగా బీసీ ఓటర్లు వైఎస్సార్‌సీపీ మొగ్గు చూపుతున్నారు. దీంతో అక్కడ 'పరిటాల' కుటుంబానికి ఈసారి కూడా ఓటమి తప్పేలా లేదు.

పెనుకొండలో కురు'బల పోరు'

టీడీపీకి 1994 నుంచి అనుకూలంగా ఉన్న పెనుకొండలో 2019లో భిన్న ఫలితాలు వచ్చాయి. ఈసారి కూడా అదే ఊపు కొనసాగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. మూడోసారి ఓడిపోయిన బీకే పార్థసారథి పోటీకి ముందుకు రావడం లేదని సమాచారం. మరోవైపు బీకే పార్థసారథి సామాజిక వర్గానికి చెందిన సవితమ్మ బల ప్రదర్శనకు సిద్ధమయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీకే పార్థకు తెలియకుండా.. కార్యక్రమాలు చేయడం విభేదాలకు ఆజ్యం పోసినట్లు అవుతోంది. అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపినా మరో వర్గం పని చేయదనే క్లారిటీ ఉండటంతో పోటీ చేసేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది.

కదిరిలో కుల రాజకీయం..

గత నాలుగు ఎన్నికలను పరిశీలిస్తే కదిరిలో టీడీపీ ఒకసారి మాత్రమే గెలిచింది. అయినా.. ఇక్కడ కుల రాజకీయం మాత్రం తగ్గలేదు. ముస్లిం ఓట్లు అధికంగా ఉన్నప్పటికీ.. పరిటాల కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కందికుంట వెంకట ప్రసాద్‌కు పగ్గాలు ఇవ్వడంతో చాలామంది తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ముస్లిం ఓటర్లు వ్యతిరేకిస్తే గెలవడం కష్టమన్న భావనలో కందికుంట వెంకట ప్రసాద్ ఉన్నారు. మరోవైపు నకిలీ డీడీల కుంభకోణం కేసుసైతం అతన్ని వెన్నాడుతోంది. ఈ నేపథ్యంలోనే పోటీ చేయాలా, వద్దా అనే సందేహంలో పడ్డారు. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు అత్తార్ చాంద్‌బాషా ప్రయత్నిస్తున్నారు.

పుట్టపర్తిలో ఇంటిగోల..

పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. సొంత పార్టీ నేతలు వడ్డే వెంకట్, మల్లెల జయరామ్, పెదరాసు సుబ్రమణ్యం, పీసీ గంగన్న...ఇలా ఎవరికి వారుగా పల్లె రఘునాథరెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈనేపథ్యంలోనే ''ఈ సారి పరిస్థితి బాగో లేదు.. వద్దులే నాన్న'' అని ఆయన తనయుడు సూచించినట్లు సమాచారం. దీంతో సొంత కులం, సొంత ఇల్లు, సొంత పార్టీ నుంచి వ్యతిరేకత రావడంతో పల్లె రఘునాథరెడ్డి కూడా పునరాలోచనలో పడినట్లు సమాచారం.

'పరిటాల' ఓవరాక్షన్‌కు బ్రేక్..

రాప్తాడు, ధర్మవరంలో 'పరిటాల' కుటుంబ పెత్తనం ఎక్కువైంది. రాప్తాడులో ఓటమితో పరిటాల శ్రీరామ్ ఈసారి ధర్మవరం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నా...పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నారు. అక్కడ శ్రీరామ్‌కు సొంత సామాజిక వర్గానికి చెందిన వరదాపురం సూరి నుంచి రాజకీయంగా ప్రమాదం పొంచి ఉంది. కాగా.. రాప్తాడు ఇన్‌చార్జ్‌గా ఉన్న సునీతను కాదని.. శ్రీరామ్ అక్కడి నుంచే బరిలో దిగుతారనే ప్రచారం మరోవైపు సాగుతోంది. దీంతో పరిటాల కుటుంబానికి మరోసారి పరాభవం తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మడకశిరలో పెత్తందారీ వ్యవస్థ..

ఎస్సీలకు రిజర్వు చేసిన మడకశిర నియోజకవర్గంలోనూ పెత్తందారు గుండుమల తిప్పేస్వామికి పెత్తనం ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్నను ప్రతి సందర్భంలోనూ గుండుమల అవమానిస్తూ వస్తున్నారు. ఈరన్నకు కాకుండా మరెవరికైనా టికెట్ ఇప్పించాలని గుండుమల ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది. దీంతో ఎస్సీ వర్గమంతా అధిష్టానంపై గుర్రుగా ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు రెండు – మూడు గ్రూపులుగా విడిపోయారు. ఎవరు పోటీ చేసినా.. సమన్వయం చేసుకోవడం అంత ఈజీ కాదని తెలుస్తోంది. ఫలితంగా ఏ వర్గం బరిలో దిగినా.. ఓడించాలనే ఉద్దేశంతో మిగతా వర్గాలు నిప్పు రాజేస్తున్నాయి.

హిందూపురంలోనూ మారని తీరు..

సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యే హోదాలో చుట్టపుచూపుగా హిందూపురం వస్తుంటారు. ఈసారి పోటీ చేస్తారో, లేదో తెలీదు. నారా లోకేశ్ హిందూపురం వస్తారనే ప్రచారం సాగుతోంది. స్థానికంగా నాయకత్వం లేక.. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారుగా కార్యక్రమాలు చేస్తున్నారు. ఫలితంగా ఓ వర్గం ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తే మరో వర్గం వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడ ఎవరు పోటీ చేసినా ఓటమి ఖాయమని టీడీపీ కార్యకర్తలే చెబుతున్నారు.

జేఎన్‌టీయూ అభివృద్ధికి సమష్టి కృషి



నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన పిలుపునిచ్చారు. సోమవారం జేఎన్‌టీయూ(ఏ)లోని పాలకభవనంలో నూతన క్యాలెండర్, డైరీ–2024ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కొత్త ఏడాదిలో శుభం జరగాలని కోరారు. వర్సిటీ అభివృద్ధి పథంలో నడవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 2024లో ఎన్ఐఆర్ఎఫ్ మంచి ర్యాంకింగ్స్ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 6న నిర్వహిస్తున్న 13వ స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ కేశవ రెడ్డి, డీఏపీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ జి. మమత, ప్రొఫెసర్ ఈశ్వర రెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి. దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. = టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టి. నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జయలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ శారద, ట్రెజరర్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

- బోధనేతర ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బోధనేతర సంఘం అధ్యక్షుడు జయకృష్ణ, ఉపాధ్యక్షుడు రాజేష్ బాబు, సెక్రటరీ జి. పుష్పలత, జాయింట్ సెక్రటరీ ఓబులేసు, కరస్పాండెంట్ లక్ష్మన్న, ట్రెజరర్ ఎండీ అన్సర్ పాల్గొన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు


నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సోదరులను గజమాలతో సత్కరిస్తున్న రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్నపార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా నరసింహయ్య కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పైలా మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అందరూ సమష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ లిఖిత, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రాజారాం, రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధాయాదవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శోభారాణి, నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి, తలారి వెంకటేశులు, అనిల్‌కుమార్ గౌడ్, ఉష, భారతి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో నూతన సంవత్సర సంబరాలు

అనంతపురం సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిపారు. జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, జెడ్పీ ఉద్యోగులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ తరలివచ్చారు. పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, ఈఈ చంద్రశేఖర్, డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, గురుమూర్తి, క్వాలిటీ సెల్ ఈఈ మల్లికార్జున, డీఈఈలు రాజేశ్వరరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ శాఖలతో పాటు రైల్వే స్టేషన్, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, కార్మిక శాఖ కార్యాలయాల్లోనూ వేడుకలు నిర్వహించారు.

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసం వద్ద సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య నాయకులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, అధికారులు, అభిమానులు తరలివచ్చి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్వీ వెటర్నరీ మహిళా యూనివర్సిటీ బోర్డు మెంబరు తోపుదుర్తి నయనతారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డీసీసీబీలో న్యూ ఇయర్ సందడి

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో సోమవారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ ఎం.లిఖిత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గతేడాది రూ.100 కోట్లు టర్నోవర్ సాధించిన ప్రధాన కార్యాలయం, రూ.50 కోట్లు సాధించిన గుత్తి, గుంతకల్లు, మడకశిర, పామిడి, పుట్టపర్తి బ్రాంచి మేనేజర్లను అభినందించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, సీఈవో ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు డి.సుఖదేవబాబు, రవికుమార్, నాబార్డు డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ డీఈఓ నివాసంలో వేడుకలు

అనంతపురం ఎడ్యుకేషన్: పూర్వ డీఈఓ సాయిరాం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం జరుపుకున్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓల సంఘం నాయకులు పూర్వ డీఈఓ సాయిరామ్‌తో కేక్ కట్ చేయించారు. అనంతరం డీఈఓ నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీవైఈఓలు శ్రీనివాస రావు, శ్రీదేవి, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తారా చంద్రనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు ప్రసాద్,రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ నాయక్, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఓబుళపతి, నాయకులు హరికృష్ణ, సాయి ప్రసాద్, గిరిజన ఉపాధ్యాయ సంఘం డెగావత్ రవీంద్ర నాయక్ , గుజ్జల శివయ్య, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డికి, తోపుదుర్తి నయనతారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. పంపనూరు ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. నూతనం సంవత్సరాన్ని పురస్కరించుకొని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు సిటీ పార్కులో ఆనందంగా గడిపారు.

కార్యాలయాల్లో '2024' సందడి

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ కార్యాలయంలో సోమవారం 2024 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో డీఏవో ఉమామహేశ్వరమ్మ, డివిజన్ కార్యాలయంలో ఏడీఏ ఎం.రవి కేక్ కట్ చేసి అధికారులు, రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపీఎంఐపీ, ఉద్యానశాఖ, పశుసంవర్ధక శాఖ, సెరికల్చర్, మార్కెటింగ్‌శాఖ కార్యాలయాల్లో జిల్లా అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, బి.రఘునాథరెడ్డి, నరసింహారావు, డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డి.ఆంజనేయులు, పి.సత్యనారాయణ చౌదరి ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. మార్కెట్‌యార్డులో చైర్మన్ ఏ ఫయాజ్, సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, డీసీఎంఎస్‌లో బీఎం విజయభాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

రాప్తాడు: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. మహిళలు కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ తెల్లవారుజామునే ఇళ్ల ముందు ముగ్గులు వేశారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

రాప్తాడు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాస గృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల విభాగం ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అభిమానులు, మహిళలు తదితరులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎస్వీ యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ నయనతా రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కలిసి వైఎస్సార్ సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్: నగర ప్రజలు ఆలయాల్లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సోమనాథ్ నగర్‌లోని కోదండ రామాలయంలో మణూరు నాగరాజు ఆధ్వర్యంలో శివపార్వతులు, శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. స్థానిక అశోక్‌నగర్‌లో అయ్యప్పస్వామికి విశేష పుష్పార్చన ఘనంగా జరిగింది. మొదటిరోడ్డు కాశీ విశ్వేశ్వరాలయం, రామనగర్, ఆర్ఎఫ్‌రోడ్డులోని శ్రీవేంకటేశ్వరాలయాల్లోని లక్ష్మీ వేంకటేశ్వరసామి విశేష పూజలందుకున్నాడు.

అనంతపురం కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ, డీఎంహెచ్‌ఓ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా విభాలకు సంబంధించిన అధికారులకు కింది స్థాయి సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ వసీం నివాసంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. మేయర్ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు, కార్పొరేటర్లు, తదితరులకు అందించారు.




కేక్ కట్ చేస్తున్న మేయర్ వసీం, నగరపాలక సంస్థ కమిషనర్, పూర్వ డీఈఓ సాయిరామ్

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, ప్రభుత్వం పింఛన్‌దారులకు నూతన సంవత్సర కానుకగా రూ.3 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు, అధికారులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ శ్రేణుల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కొత్త ఏడాది ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ప్రజలందరి ఆశీర్వాదంతో అధికారంలోకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఊహకందని సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలు మరోసారి తీర్పు ఇచ్చే అవకాశం వచ్చిందని, తప్పకుండా నూతన ఏడాదిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డీఎస్పీ ప్రసాదరెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు, నాయకులు


ఏడీసీసీ బ్యాంకులో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ లిఖిత, పామిడి వీరా


కేక్‌కట్ చేస్తున్న అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్


కేక్ కట్ చేస్తున్న నదీం, మీసాల రంగన్న,తదితరులు


మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీటీసీ హేమావతి, ఎంపీపీ జయలక్ష్మి


వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ నివాసంలో నూతన సంవత్సర వేడుకలు


తోపుదుర్తి నయనతారెడ్డికి బొకే అందిస్తున్న ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు


సోమనాథనగర్‌లో శ్రీవారి కల్యాణోత్సవం


డీఏఓ ఉమామహేశ్వరమ్మకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం


జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింగ్ సూపరింటెండెంట్లు, స్టాఫ్‌నర్సులు


కేక్ కట్ చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి


మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఉద్యోగులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలో ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఆల్‌మేవా) జిల్లా శాఖ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగీ అంకిత భావంతో పనిచేసి, ప్రజల సమస్యలు పరిష్కరించి వారి మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూక్, గౌరవాధ్యక్షుడు హిదాయతుల్లా, నాయకులు జిలాన్, దౌలా, మహబూబ్‌బాషా, మగ్బూల్, అమీర్, ఏఎంబాషా, షరీఫ్, రసూల్, ఆక్రమం, అన్వర్, అలి, ఖయ్యూమ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్పతరు మహోత్సవం


కల్పతరు మహోత్సవంలో పూజలందుకున్న రామకృష్ణ గురుదేవులు

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కల్పతరు మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. రామకృష్ణ పరమహంస చిత్రపటాలకు పూజలు చేశారు. ఏటా రామకృష్ణ పరమహంస కల్పతరు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని నిర్వాహకులు డాక్టర్ కృష్ణకళ, వేణుగోపాలరావు, జైపాల్‌రెడ్డి, భాస్కర్, శోభ తదితరులన్నారు.

అనంత కళా సేవలు ప్రశంసనీయం


ఎల్కేపీ కార్యదర్శి పద్మజను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత కళారంగానికి ఎంతో మంది ఎనలేని సేవలందిస్తుండడం ప్రశంసనీయమని ఆర్డీటీ డైరెక్టర్ విశాలఫెర్రర్ అన్నారు. రాష్ట్రస్థాయి అవార్డులందుకున్న కళాకారులకు సత్కారాలందుకున్నారు. సోమవారం రాత్రి లలితకళా పరిషత్తులో జరిగిన కార్యక్రమంలో విశాల ఫెర్రర్, ఎల్కేపీ అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, గాజుల పద్మజ హాజరై మాట్లాడారు. రంగస్థలానికి సేవలందించిన సోమిరెడ్డి, వనజకుమారి, గాయత్రి, బండారు నగేష్, పాములాయి రాఘవను సన్మానించారు. అంతకు ముందు చిన్నారుల ఆటపాటలతో వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యనిర్వాహక సభ్యులు సంగాల నారాయణస్వామి, రామగోవిందు తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ సీఐగా వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల సీఐగా వెంకటేశ్వర్లుగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ నాగార్జున రెడ్డి వీఆర్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో సీఐగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు బీకేఎస్ మండలానికి సీఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్టేషన్‌కు వచ్చి కలవాలన్నారు.

అనంత కళాకారులకు నంది అవార్డులు గర్వకారణం


డైరెక్టర్ ప్రభాకర్‌కు నంది అవార్డు అందిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు



విశాలఫెర్రర్‌ను సన్మానిస్తున్న డాన్స్ మాస్టర్ల సంఘం నాయకులు, నృత ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: రాష్ట్రస్థాయిలో అనంత కళాకారులు నంది అవార్డులు దక్కించుకోవడం గర్వకారణమని నగర మేయర్ వసీం అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని లలిత కళాపరిషత్‌లో కళాకారులను సన్మానించారు. మేయర్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. మేయర్ మాట్లాడుతూ అనంత కళాకారులు 4 నంది అవార్డులను దక్కించుకోవడం గర్వకారణమన్నారు. గత నెల 23 నుంచి 29 వరకు గుంటూరులో జరిగిన రాష్ట్ర చలన చిత్ర, టీవీ నాటకరంగ అభివృద్ధి సంస్థ నిర్వహించిన నంది నాటకోత్సవంలో అనంత కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రెడ్డి, సెయింట్ అగస్టీ పాఠశాల కరస్పాండెంట్ రాజమ్మ, ప్రధానోపాధ్యాయురాలు విజయ, క్లర్క్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డాన్సు నైట్..

నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని జిల్లా డాన్స్ మాస్టర్స్ అండ్ డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన డాన్స్ నైట్ కార్యక్రమం అలరించింది. 20 మంది డాన్సు మాస్టర్లు, 300 మంది డాన్సర్లతో వివిధ రకాల సినీ, జానపద, సంప్రదాయ నృత్యాలతో ఎల్కేపీ ఆడిటోరియం మార్మోగింది. ఆర్డీటీ డైరెక్టర్ విశాల ఫెర్రర్, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, పాప్‌చిన్ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై డాన్సర్లకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందించారు. స్థానిక కృష్ణకళామందిరంలో అనంత నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ నాగిన్ ప్రసాద్ ఆధ్వర్యంలో అనంత కళాభిమానుల మహోత్సవం ఘనంగా జరిగింది. ఆనంద్ సంగీతామృత విభావరి పలువురు గాయనీగాయకులు అద్భుతంగా పాటలు పాడి ప్రేక్షకులను రంజిపజేశారు. మేయర్ వాసీం, డిప్యూటీ మేయర్లు కోగట విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, నాట్యాచార్యులు సంధ్యామూర్తి కళాభిమానులను సత్కరించారు.

ఏపీజీబీలో ఆధునిక సేవలు

- 2024 కానుకగా ప్రగతి కుబేర్
- ఆర్ఎం శ్రీదేవి వెల్లడి


పి.శ్రీదేవి

అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రగతి ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ)లో అన్ని రకాల ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ పి.శ్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక ఆ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుల్లో కేక్ కట్ చేసి జిల్లా ప్రజలకు, ఖాతాదారులకు, బ్యాంకు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జిల్లా పరిధిలో 65 శాఖల ద్వారా నెట్‌బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, వ్యాట్సాప్ బ్యాంకింగ్, ఆర్‌టీజీఎస్ లాంటి అన్ని రకాల ఆధునిక సేవలు అందజేస్తున్నామన్నారు. అనంతపురం రీజియన్ అన్ని రంగాల్లో అగ్రస్థానంలో కొనసాగుతోందన్నారు. నూతన సంవత్సర కానుకగా తాజాగా 444 రోజుల మెచ్యూరిటీ వ్యవధి ఉన్న 'ప్రగతి కుబేర్' ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. ఇందులో సాధారణ ఖాతాదారులకు 7.50 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.30 శాతం వడ్డీరేటు వర్తిస్తుందన్నారు. పెద్ద ఎత్తున పంట రుణాలతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతికి విరివిగా రుణాలు ఇస్తున్నామన్నారు. దీంతో బ్యాంకు రీజియన్ టర్నోవర్ రూ.6,090 కోట్లకు చేరుకోగా ఇందులో డిపాజిట్లు రూ.2,844 కోట్లు, రుణాలు రూ.3,246 కోట్లు ఉన్నాయని, నిరర్ధక ఆస్తులు (ఎన్‌పీఏ) రూ.40 కోట్లు ఉన్నట్లుగా తెలిపారు.